www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం జులై 19 2024

5

చిత్తూరు



పుంగనూరులో ఉద్రిక్తత

- ఎంపి మిథున్‌రెడ్డిని అడ్డుకున్న టిడిపి
- ఇరు పార్టీ శ్రేణుల రాళ్లదాడులు
- స్కార్పియోతో సహా 9 వాహనాలు ధ్వంసం
- పోలీసు వాహనంలో ఎంపి తరలింపు





ప్రజాశక్తి - పుంగనూరు: ఇటీవల కూల్చివేసిన ఇండోర్ స్టేడియాన్ని పరిశీలించి, మీడియాతో మాట్లాడాలని పుంగనూరుకు విచ్చేసిన ఎంపి మిథున్‌రెడ్డిని టిడిపి అడ్డుకోవడంతో ఉద్రిక్తతకు దారితీసింది. చిత్తూరు మాజీ ఎంపి రెడ్డెప్ప ఇంట్లో అల్పాహార విందు చూసుకుని, నేలమట్టం చేసిన ఇండోర్ స్టేడియంను పరిశీలించడానికి ఎంపి వెళ్లాల్సి ఉండగా అంతలోనే టిడిపి కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. అంబేద్కర్ సర్కిల్ నుంచి ప్రదర్శనగా రెడ్డెప్ప ఇంటి పరిసరాలకు వెళ్లారు. అప్పటికే అప్రమత్తమైన పోలీసులు పహారా ఏర్పాటు చేశారు. ఇంటి సమీపంలోకి వెళ్లిన టిడిపి కార్యకర్తలపై వైసిపివారు రాళ్లు రువ్వారు. దీంతో టిడిపి నాయకులు టమోటాలు, కోడిగుడ్లు విసిరారు. తమపై తప్పుడు కేసులు పెట్టి, మూడు నెలల పాటు జైల్లో ఉంచారని, అప్పట్లో తాము అనుభవించిన బాధ వారూ అనుభవించాలని, పండగ పూటా ఇంట్లో లేకుండా జైల్లో గడిపామని పోలీసులు ఎంత చెప్పినా వినకుండా టిడిపి కార్యకర్తలు మండిపడ్డారు. వైసిపి ఎంపి గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ఎంపి ఇంటిని చుట్టుముట్టి రాళ్లదాడి చేశారు. గొడవలు జరుగుతాయని ముందస్తుగా తెలుసుకున్న వైసిపి నాయకులు వారి వాహనాలను వేరే చోట పెట్టారు. అయితే టిడిపి కార్యకర్తలు ఆవేశంతో అక్కడున్న వాహనాలతో పాటు, దాచి ఉంచిన వాహనాలనూ గుర్తించి అద్దాలను రాళ్లతో ధ్వంసం చేశారు. చిత్తూరు మాజీ ఎంపి రెడ్డెప్ప స్కార్పియో వాహనానికి నిప్పు అంటించారు. అగ్నిమాపక శాఖ వారు వచ్చి మంటలను అదుపు చేశారు. పోలీసులు ఇరు పార్టీల వారిని అదుపు చేయడంలో విఫలమయ్యారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ రెడ్డెప్ప ఇంటి వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కోట్లల్లోనే ఆస్తినష్టం వాటిల్లి ఉంటుందని అంచనా. కరెంట్ ఫీజులు సైతం తొలగించారు. ఈ సందర్భంగా మిథున్‌రెడ్డి గన్‌మన్ మూడు రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపారు. అడిషనల్ ఎస్‌పి అరీఫుల్లా వాహనంలో రాజంపేట పార్లమెంట్ సభ్యుడు మిథున్‌రెడ్డిని అక్కడనుంచి తరలించారు.

రైతులకు పరిహారం చెల్లిస్తామంటే వచ్చాం : టిడిపి

నేతిగుట్లపల్లి రిజర్వాయర్ భూములు కోల్పోయిన రైతులకు ఎంపి పరిహారం చెల్లిస్తామని చెప్పడంతో రైతులందరూ అక్కడకు వచ్చారని, వైసిపి ఇదే అదునుగా చూసుకుని తమ కార్యకర్తలపై దాడులకు పాల్పడిందని టిడిపి రూరల్ అధ్యక్షులు గంగసాని మాధవరెడ్డి అన్నారు. తమ కార్యకర్తలు పదిమందిపైనే గాయపడి చికిత్స పొందుతున్నారనానరు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ అధికారంలో ఉన్నపుడూ, లేనపుడు తమపై దాడులు చేయిస్తోందన్నారు. శ్రీకాంత్, సివి రెడ్డి, సయ్యద్ సుహెల్‌బాషా, సద్దాం పాల్గొన్నారు.

కక్షపూరిత రాజకీయాలొద్దు : ఎంపి

కక్షపూరిత రాజకీయాలతో దాడులు చేస్తే సహించేది లేదని రాజంపేట పార్లమెంట్ సభ్యులు పివి మిథున్‌రెడ్డి అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో కక్షపూరిత రాజకీయాలు జరుగుతున్నాయన్నారు. వైసిపి నాయకులు, మద్దతుదారులపై దాడులకు ప్రోత్సహిస్తోంది చంద్రబాబు, నారా లోకేష్ అన్నారు. నిన్న వినుకొండలో నడిరోడ్డుపై వైసిపి లీడర్ చేయి నరికారన్నారు. అధికారం శాశ్వతం కాదన్నారు. ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటామని, ప్రతి విషయం మాకు గుర్తు ఉంటుందన్నారు. ఇలాంటి దాడులకు భయపడే ప్రసక్తే లేదన్నారు.

గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం

- చిన్నపాటి వర్షానికి రోడ్లపైకి నీరు
- రోజుల తరబడి నిల్వతో దుర్వాసన
- పట్టించుకోని అధికారులు



బురదమయమైన దారులు



తాగునీటి బోరు వద్ద దుస్థితి

ప్రజాశక్తి- విజయపురం: అధికారుల నిర్లక్ష్యం కారణంగా మండలంలో పారిశుధ్యం లోపిస్తోంది. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే వర్షపు నీరు మురుగునీరుతో కలిసి రోడ్లపై ప్రవహిస్తున్నాయి. నీరు నిల్వ చేరి చాలా బురదమయంగా మారుతున్నాయి. అంతేకాకుండా దోమలు, పురుగులు వృద్ధి చెంది దుర్వాసనతోపాటు దోమల బెడద తప్పడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రభుత్వాలు మారుతున్న పల్లెల్లో అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్న చందంగా ఉంటోందని విమర్శిస్తున్నారు గ్రామస్తులు.

వర్షపు నీరు రోడ్లపైన రోజుల తరబడి నిల్వ ఉంటూ మురికి కూపాలుగా దర్శనమిస్తున్నాయి. బురదలోని అడుసుగా మారి ప్రయాణించాలన్నా అవస్థలు తప్పడం లేదు. ఎక్కడ చూసినా పారిశుధ్య లోపించడంతో ప్రజలు రోగాల బారినపడుతున్నారు. పారిశుద్ధ్య చర్యలు చేపట్టాల్సిన పాలకులు, అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం శోచనీయం.

మండలంలోని బూచివనత్తం గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అరకొరకగా ఉంది. ఉన్న డ్రైనేజీ వ్యవస్థ కూడా చెత్తాచెదరంతో పూడిపోయి మురుగు నీరు మొత్తం ప్రధాన రహదారిపై పారుతున్న పరిస్థితి ఉంది. సిసి రోడ్డుపైన వర్షపు నీరు నిల్వ చేరుతోంది. గ్రామాల్లో చిన్నపాటి వర్షానికి రోడ్లు చిత్తడి చిత్తడిగా మారిపోతున్నాయి. కొన్ని రోడ్లలో నీరు చేరి చెత్త అక్కడే మురుగుతోంది. చెత్త నుంచి వచ్చే దుర్వాసనకు ప్రజలు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు చెప్పే మాటలకు చేతలకు పొంతన లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పిల్లలకు ఇదేం దుస్థితి..

బూచివనత్తం గ్రామంలో పాఠశాల ముందున్న ప్రాంతమంతా మురుగునీరు చేరిన అధ్వానంగా తయారైంది. విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలంటే నిల్వ చేరిన మురుగు నీటిని దాటుకొనే వెళ్లాలి. ఈ క్రమంలో పలువురు విద్యార్థులు మురుగులోపడిపోయిన సందర్భాలు ఉన్నాయి. చిన్నపాటి వర్షాలకే గ్రామంలో పరిస్థితి ఇలా ఉంటే ఇక వర్షాకాలంలో వానలు పడుతూనే ఉన్నప్పుడు తమ పిల్లల ఆరోగ్యం పరిస్థితి ఏమిటని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమ గ్రామంలో పారిశ్ధ్య పనులతోపాటు రోడ్ల మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎడ్యుకేషనల్ హబ్‌గా కుప్పం

నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి కృషి: కలెక్టర్



ప్రజాశక్తి- కుప్పం టౌన్ : కుప్పంను ఎడ్యుకేషనల్ హబ్‌గా తయారు చేయడానికి చర్యలు చేపట్టడం జరుగుతున్నదని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం కుప్పం ఎంపిడిఓ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలో ప్రజావినతుల స్వీకరణ పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్, జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, కడా ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్, డ్వామా పీడీ ఎన్.రాజశేఖర్, కుప్పం ఆర్‌డిఓ శ్రీనివాసులు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమం అనంతరం పాత్రికేయులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కుప్పంను ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా కేంద్రీయ విద్యాలయం స్థాపనకు, కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు అవసరమైన భూమిని పరిశీలించడం జరుగుతున్నదన్నారు. కుప్పం నియోజకవర్గ పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి స్థానికంగా ప్రజావినతుల స్వీకరణ పరిష్కారం కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ కార్యక్రమం ద్వారా ప్రధానంగా రెవెన్యూ సమస్యలకు సంబంధించి వినతులు అందుతున్నాయని, వీటితో పాటు సామాజిక పెన్షన్, గృహ నిర్మాణం, మౌలిక వసతుల కల్పన, తదితర సమస్యలకు సంబంధించి వినతులు వస్తున్నాయన్నారు. ఈ వినతులను 15 రోజులు గడువులోపు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. జిల్లా యంత్రాంగం తరఫున జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లు క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారంలో ప్రగతిని సమీక్షించడం జరుగుతుందన్నారు. మండల, డివిజన్ పరిధిలో పరిష్కారమయ్యే సమస్యలను ఆయా స్థాయిలోనే పరిష్కరించడం జరుగుతుందని, మండల, డివిజన్ స్థాయిలో పరిష్కారం కానివి జిల్లా స్థాయిలో పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి కుప్పం నియోజకవర్గంలో పర్యటించి సమస్యలపై సమీక్షించడం జరుగుతుందని తెలిపారు. రానున్న 6 నెలల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డిఆర్డిఏ, హౌసింగ్ పిడి తులసి, పద్మనాభం, నాయకులు మునిరత్నం, డాక్టర్ సురేష్, అధికారులు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డు నిర్మాణానికి చర్యలు

ఎమ్మెల్యే మురళీమోహన్



ప్రజాశక్తి- పూతలపట్టు: పూతలపట్టు మండలం, పి.కొత్తకోట సమీపంలో జాతీయ రహదారిని నేషనల్ హైవే అథారిటీ అధికారులతో కలిసి పూతలపట్టు ఎమ్మెల్యే మురళిమోహన్ పరిశీలించారు. ఇంజనీరింగ్ కళాశాల నుండి పి.కొత్తకోట వరకూ జాతీయ రహదారిపై నుంచి గ్రామీణ ప్రాంతాలకు వెళ్ళేందుకు సరైన రోడ్డుమార్గం లేక ప్రజలు గత కొన్నేళ్లుగా తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ విషయాన్ని వివిధ గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం నేషనల్ హైవే అథారిటీ అధికారులతో కలిసి ఆయన సమస్యను పరిశీలించారు. అనంతరం పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ మీడియాతో మాట్లాడుతూ.. పాకాల, పూతలపట్టు, పెనుమూరు, ఐరాల మండలాలకు చెందిన స్థానికులు తమ ప్రాంతాలకు వెళ్లాలంటే ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, జాతీయ రహదారిపై నుంచి కొత్తకోట వైపు వెళ్లాలంటే ఏమాత్రం మార్గం లేని కారణంగా వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అదేవిధంగా సామాజిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు ఆయన వివరించారు.

ప్రాథమిక పాఠశాల పునఃప్రారంభం

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం మండలం చందం గ్రామ పంచాయతి ఎస్సీ కాలనీలో ప్రాథమిక పాఠశాలను తూర్పు రాయలసీమ పట్టభద్రుల శాసనమండలి సభ్యులు డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పునః ప్రారంభించ్చారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ హరిజనవాడలోని ప్రాథమిక పాఠశాలను గత ప్రభుత్వ హయాంలో మూసివేశారని మండిపడ్డారు. గత ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానికంగా మూసివేయబడ్డ పాఠశాల విషయాన్ని ప్రజలు తమ దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. ఆ సమయంలో ఇచ్చిన మాట ప్రకారం నేడు పాఠశాలను పునః ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.



వీధి కుక్కల స్వైర విహారం

- ప్రజలను బెంబేలెత్తిస్తున్న శునకాలు
- వృద్ధులు, చిన్నారులపైనే కాకుండా జీవాలపై కూడా దాడులు
- పట్టించుకోని పశుసంవదర్ధక శాఖ అధికారులు



ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని పలు గ్రామాల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గత కొంత కాలంగా కుక్కల దాడిలో చాలా మంది గాయాల పాలైయ్యారు. వృద్ధులు, చిన్నారులు, మహిళలపైకే కాకుండా లేగ దూడలు, మేకలు, గొర్రెలపై కూడా వీధి కుక్కలు మూకుమ్మడిగా దాడులు చేసి చంపేస్తున్నాయి. కుక్కలు కరవడం వలన వాటిని నుంచి వచ్చే వైరస్ వర్షాకాలంలో ప్రమాదంగా మారుతాయి. కుక్క కరిచిన వెంటనే స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందాలి. వైద్యులు సూచించిన మేరకు ఇంజెక్షన్లు వేసుకోవాలి.

మండలంలో మొత్తం 25 పంచాయతీలు ఉన్నాయి. ఇందులో పచ్చికాపల్లం, వెదురుకుప్పం, పాతగుంట, జక్కదొన, బ్రాహ్మణపల్లె, మొరవ, దేవళంఘట, బొమ్మయ్యపల్లి ప్రాంతాలు ప్రధానమైన సెంటర్లుగా ఉన్నాయి. ఇక్కడే ఎక్కువగా కుక్కలు గుంపుగుంపులుగా సంచరిస్తూ ఉంటాయి. దారిలో వెళ్లేవారిపై, వాహనదారులపై మూకుమ్మడిగా ఎగబడతాయి. కొందరు వీటివలన కింద పడి గాయాలపాలైన వారూ ఉన్నారు. ఈ మార్గాల్లో పిల్లలు, వృద్ధులు, మహిళలు ఒంటరిగా రావాలంటేనే భయపడాల్సిన పరిస్థితి. గతంలో ఓ పిచ్చికుక్క మాంబేడు గ్రామంలో ఏకంగా 11 పాడి ఆవులను గాయపరిచింది. ఈ దాడిలో నాలుగు పాడి ఆవులు మృతి చెందాయి. అంతేకాకుండాపచ్చికాపల్లంలో కుక్కలు గుంపుగా దాడి చేసి గొర్రెల మందపై దాడి చేసి గాయపరడంతో 6 గొర్రెలు మరణించాయి. పశువులపై దాడి జరిగినప్పుడు పశువైద్యశాల వారు వాటికి చికిత్స చేసి చేతులు దులుపుకుంటున్నారు తప్ప కుక్కలకు టీకాలు వేయడం లేదా మున్సిపాల్టీ వారు కుక్కలను పట్టుకొని వెళ్లడం వంటి చర్యలు మాత్రం తీసుకోవడం లేదు. దీంతో ఇటు ప్రజలు అటు పశువులకు కుక్కల బెడద తప్పడం లేదు..

జాగ్రత్తలు పాటించడం

డాక్టర్ రూప, సహాయ సంచాలకులు, వెదురుకుప్పం



కుక్క కాటు వలన రేబిస్ అనే అతి భయంకరమైన, ప్రాణాంతకమైన వ్యాధి వస్తుంది. దీని నుంచి టీకా మందుల ద్వారానే పశువులను కాపాడుకోవాలి. నాటు వైద్యం చేయకూడదు. కుక్క కరిచిన వెంటనే వాటి యజమాని పశువుల శరీరంలో ఏ భాగంలో కరిచిందో ఆ భాగంలో వేడినీళ్ల సహాయంతో సోపుతో గాయాన్ని శుభ్రంగా ఒకటికి, రెండుసార్లు కడగాలి. అప్పుడే ఆ వైరస్ శరీరంలోకి ప్రవేశించకుండా నశిస్తుంది. తరువాత పశు వైద్యశాలలో డాక్టర్‌ను సంప్రదించి వెంటనే వ్యాక్సినేషన్ చేయించుకోవాలి. కుక్క కరిచిన రోజు నుంచి ఆరు డోసులు టీకాను, మందులను పశువుకు ఇవ్వాలి. ఇలా చేయడం వలన రేబిస్ వ్యాధి నుండి పశువులను కాపాడుకోవచ్చు. కుక్క కాటుకు గురైన పశువులను వానలో తడవకుండా నీడ చాటున కట్టేయాలి. వానలో తడిస్తే వాటి శరీరంలో ఉన్న వైరస్ వేగంగా వ్యాప్తి చెంది, పశు ప్రాణం మీదకి వస్తుంది.

ప్రాథమిక చికిత్స తప్పనిసరి

- డాక్టర్ ప్రవీణ, వైద్యాధికారిణి, పచ్చికాపల్లం పిహెచ్‌సి



కుక్క కరిచిన వెంటనే సోపుతో ఆ గాయాన్ని శుభ్రంగా కడగాలి. అప్పుడే రాబిస్ వైరస్ నశిస్తుంది. గాయంపై ఎలాంటి నాటువైద్య రసాన్ని పూయకూడదు. కుక్క కరిచిన వెంటనే ప్రాథమిక చికిత్స తప్పనిసరిగా చేయించుకోవాలి. గాయానికి ఎటువంటి కట్టు కట్టకుండా ఓపెన్‌గా వదిలేయాలి. పెంపుడు కుక్క కరిచినప్పుడు ఆ యజమాని ఆ కుక్కకు టీకా వేయించుకోవాలి. కుక్క కరిచిన వెంటనే టీకా వేయించుకోవాలి, లేకపోతే రాబిస్ వైరస్ వ్యాప్తి చెందుతుంది మనిషికి ఇది ప్రాణాంతకం. గాయ తీవ్రతను బట్టి ఇమ్యూ నో గ్లోబులిన్ టీకాను గాయమైనచోట వేయించాలి. పై నియమాలు పాటిస్తే ఈ కుక్కకాటు ప్రమాదం నుంచి బయటపడవచ్చు.



గతంలో కుక్కల దాడిలో గాయపడిన దూడకు టీకా వేస్తున్న దృశ్యం

తప్పక హెల్మెట్ ధరించాలి: జిల్లా ప్రధాన న్యాయమూర్తి



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ. భీమారావు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం స్థానిక జిల్లా కోర్టులో జిల్లా న్యాయ సేవఅధికార సంస్థ కార్యదర్శి వెన్నెల, పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పిపి) లోకనాథ్ రెడ్డితో కలిసి ద్విచక్రాల వాహనాలు నడిపే అందరూ హెల్మెట్ ధరించాలన్న అంశంపై అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ గౌరవ రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. చాలా మంది ప్రమాదాలలో ఎవరైతే హెల్మెట్ ధరించకపోవడంతో ఎక్కువ మంది ప్రమాదాల్లో మరణిస్తున్నారన్నారు. రోడ్డు ప్రమాదాలలో 90 శాతం ద్విచక్ర వాహనం నడిపే వారి వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. కాబట్టి ఈ ప్రమాదాలు నివారించాలంటే ఇలాంటి అవగాహనలో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ ర్యాలీ జిల్లా కోర్టు నుండి హైరోడ్డు మీదుగా పిసిఆర్ కళాశాల ద్వారా గాంధీ విగ్రహం వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో జిల్లా న్యాయ అధికారులు, న్యాయవాదులు వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

'వీవోఏలపై వేధింపులు మానుకోవాలి'



సమావేశంలో మాట్లాడుతున్న వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో వీవోఏలను రాజకీయ వేధింపులతో తొలగించే ప్రయత్నం వెంటనే మానుకోవాలని ఏపీ వెలుగు యానిమేటర్స్ ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేసింది. గురువారం చిత్తూరులో సిఐటియు కార్యాలయంలో ఏపీ వెలుగు యానిమేటర్స్ ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వాడ గంగరాజు, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు జీను రాజశేఖర్, శ్రీధర్ బాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన తప్పిదాలే ప్రస్తుత ప్రభుత్వం చేయడం దారుణమన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా వీఓఏలను అకారణంగా తొలగించే ప్రయత్నాలు చేయడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం నిబంధనలను తుంగలోతొక్కి ప్రభుత్వాలు మారినప్పుడల్లా బెదిరించడం ఏమిటని ప్రశ్నించారు. ప్రస్తుతమున్న వీవోఏలను యధాతథంగా కొనసాగించాలని, తొలగించే ప్రయత్నాలు చేస్తే పెద్దఎత్తున పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం వీఓఏలకు కనీస వేతనం అమలు చేయాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, ఈఎస్ఐ పిఎఫ్ ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కిందిస్థాయి తెలుగుదేశం నాయకులు ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా తమ ప్రభుత్వం అధికారంలో ఉంది కదా అని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే గత ప్రభుత్వాన్ని పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. జిల్లాలో సదుం, సోమల, బైరెడ్డిపల్లి, పంజాణి మండలాలలో రాజకీయంగా తొలగించడం దారుణమన్నారు.

డిఆర్ఓకి వినతి

జిల్లాలో జరుగుతున్న రాజకీయ వేధింపులపై అధికారులు వెంటనే స్పందించాలని డిఆర్ఓకి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. సమస్యలు విన్న డిఆర్ఓ స్పందిస్తూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఎవరిని తొలగించకుండా చూస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో విఓఏల సంఘం జిల్లా కార్యదర్శి నాగరాజు, కోశాధికారి వసంత, జిల్లా నాయకులు శేషాద్రి పాల్గొన్నారు.

'డయల్ యువర్ ఎమ్మెల్యే'లో 48 ఫిర్యాదులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల అమలు, ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించడం కోసమే ప్రతివారం 'డయల్ యువర్ ఎమ్మెల్యే' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, కార్యక్రమంలో ప్రజల నుంచి అందే ప్రతి సమస్యను పరిష్కరించడానికి చిత్తశుద్ధితో కృషి చేస్తామని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ చెప్పారు. గురువారం చిత్తూరు నగరపాలక కార్యాలయంలో ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు ఫోన్ ద్వారా సమస్యలను నేరుగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ప్రతి సమస్యను ఎమ్మెల్యే సావధానంగా విని సమాధానాలు చెప్పారు. కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే మేయర్ ఎస్.అముద, కమిషనర్ డాక్టర్ జె.అరుణతో కలిసి నియోజకవర్గ అధికారులతో సమీక్ష నిర్వహించారు. గతవారం అందిన ఫిర్యాదుల్లో 23 పరిష్కరించడంపై అధికారులను అభినందించారు. మిగిలిన 16 సమస్యలను వేగంగా పరిష్కరించాలని, ఈవారం అందిన సమస్యలను వీలైనంత వేగంగా పరిష్కరించాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కారంలో అధికారులు పాజిటివ్ దృక్పథాన్ని కలిగి ఉండాలని, పరిష్కరించలేని సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, నగరపాలక, చిత్తూరు రూరల్, అర్బన్, గుడిపాల మండలాల అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 48 ఫిర్యాదులు అందాయని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ తెలిపారు. నగర పాలక సంస్థ 31, రెవెన్యూ 5, పోలీస్ 7, ట్రాన్స్ కో 1, పంచాయతీరాజ్ 2, హౌసింగ్ 1, సాయం 1 వినతులు అందాయి. వినతులను క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.

లైట్లు వేశారు, కాలువలు శుభ్రం చేశారు..

వీధిలో లైట్లు లేవని, కాలువలు శుభ్రం చేయలేదని గత



గురువారం డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమంలో ఫిర్యాదు చేశాను. మరుసటి రోజు వీధి లైట్లు వేశారు, కాలువలు శుభ్రం చేశారు. ధన్యవాదాలు ఎమ్మెల్యే గారు అంటూ కొంగారెడ్డిపల్లి గురునగర్ కాలనీకి చెందిన మహింధర్ సంతోషం వ్యక్తం చేశారు..

మట్టి విగ్రహాలని పూజించండి : ఎమ్మెల్యే

పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి వనరులను కాపాడుకోవడంలో భాగంగా ప్రతి ఒక్కరు మట్టితో చేసిన వినాయక విగ్రహాలనే పూజించాలని ఎమ్మెల్యే గురజాల పిలుపునిచ్చారు. మట్టి వినాయక విగ్రహాల తయారీదారులను ప్రోత్సహించాలని, వీధుల్లో, గ్రామాల్లో పిఒపి విగ్రహాలకు బదులుగా మట్టితో చేసిన విగ్రహాలను ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. తన వంతుగా ఈ వినాయక చవితికి 25వేల మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తామన్నారు. ఇదే సమయంలో నగరంలో ప్లాస్టిక్ వినియోగాన్ని గణనీయంగా తగ్గించేందుకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ప్రజలు, వ్యాపారస్తులు తమ వంతు బాధ్యతగా ప్లాస్టిక్ వినియోగాన్ని కనిష్ట స్థాయికి తగ్గించుకోవాలని పిలుపునిచ్చారు.

అక్రమంగా చెరువు మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్యేకు సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు ఫిర్యాదు

నగరంలో 11వ వార్డు పరిధిలో ఉన్న చెన్నమ్మ గుడి చెరువు నుండి అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు ఫిర్యాదు చేశారు. చెరువులో మట్టిని అక్రమంగా తరలిస్తూ వేల రూపాయల గడిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. రోజుకి 100 పైన ట్రాక్టర్లు మట్టిని తరలిస్తుండడంతో చుట్టుపక్కల ప్రజలకు కూడా ఇబ్బందికరమైన పరిస్థితికి ఉందని, చెరువులను కాపాడాల్సిన అధికారులు చూస్తూ ఊరుకోవడం బాధాకరమన్నారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ స్పందిస్తూ వెంటనే దానిపై చర్యలు తీసుకొని సమస్యను పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే చిత్తూరు నగరంలో డ్రైనేజీ వ్యవస్థపై కూడా దృష్టి పెట్టాలని పార్కింగ్ సమస్య కూడా తీవ్రంగా ఉందని వీటిపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు.

పరిశ్రమలు తేవడమే లక్ష్యం

ఎమ్మెల్యే డాక్టర్ థామస్



ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: నియోజకవర్గంలో పరిశ్రమలు తేవడమే లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అన్నారు. నియోజకవర్గంలో యువతకు ఉపాధి కల్పించడానికి ఇటీవల కార్ల విడిభాగాల తయారీ గ్లోబల్ వెంచర్ సంస్థతో చర్చలు జరిపినట్లు తెలిపారు. అనంతరం నెల్లెపల్లెలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న విద్యాకిట్లను విద్యాశాఖ అధికారులతో కలిసి పంపిణీ చేశారు. ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధి కోసం ఎన్నో మౌలిక వసతులు ప్రభుత్వం కల్పిస్తున్నాయని వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఉపవిద్యాశాఖ అధికారి చంద్రశేఖర్, ఎంఈఓలు ఆంజనేయులు శెట్టి, గుణశేఖర్‌రెడ్డి, తహశీల్దార్ రవి, సిడిపిఓ వినుతశ్రీ, జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ యుగంధర్, టిడిపి నాయకులు దేవసుందరం, కృష్ణమ నాయుడు, జ్యోతి యాదవ్, పాల్గొన్నారు.

పింఛన్ పెంచాలని ఎమ్మెల్యేకు వినతి

నియోజకవర్గ పరిధిలోని పెనుమూరు మండలం తోకల చెరువు గ్రామానికి చెందిన తులసిరామిరెడ్డి బాల్యంలో పోలియో సోకడంతో వికలాంగుడిగా మారారని, పూర్తిస్థాయిలో కుటుంబ సభ్యుల సహకారం ఉంటే తప్ప వ్యక్తిగత పనులు సైతం చేసుకోలేదని తన కుమారుడికి రూ.6000లు పెన్షన్ వస్తుందని తెలిపారు. అయితే ప్రత్యేక పరిస్థితుల్లో రూ.15 వేలు పెన్షన్ పెంచి ఇప్పించాలని తులసిరామిరెడ్డి తల్లి ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌కు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తానని ఆ హామీ ఇచ్చారు.

'ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి'

ప్రజాశక్తి- గంగవరం, పలమనేరు: ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులే కాదు ప్రజలు కూడా సహకారం అందించాలని జాతీయ మానవ హక్కుల సంస్థ బృందం కోరారు. గురువారం ఆ సంస్థ కార్యాలయంలో జిల్లా నాయకులు డివి.మునిరత్నం, వేలయుధం మాట్లాడుతూ పలమనేరు పట్టణంలో రోజురోజుకు ట్రాఫిక్ పెరిగిపోతున్న నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులే కాకుండా ప్రజలు కూడా సహకరించాలని కోరారు. పెరిగిన ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకొని గతంలో పోలీసు వారు పలమనేరు పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలు సూచిస్తూ పార్కింగ్, నో పార్కింగ్ బోర్డులను ఏర్పాటు చేసినప్పటికీ ప్రజలు నిబంధనలను పక్కనపెట్టి నోపార్కింగ్ బోర్డులు ఉన్న పక్కనే వాహనాలను నిలబెట్టి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారని అన్నారు. ఇకనైనా ప్రజలు పోలీసులకు సహకరించా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు.

ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు

ప్రజాశక్తి- విజయపురం (నగరి): స్థానిక కేంద్ర సహకార బ్యాంకులో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గురువారం సహకార బ్యాంకులో రైతులకు కళాజాత ద్వారా పాటల రూపంలో బ్యాంకులో ఇచ్చే రుణాల వివరాలు, డ్వాక్రా మహిళలు పొదుపు ఎలా చేసుకోవాలనే అంశాలను నిశితంగా వివరించారు. తాడేపల్లి గూడెం వి.సత్యకృష్ణ వీది నాటిక కళా బృందం వారు నిర్వహించిన ఈ కళాజాత అందరినీ ఆకర్షించింది. వివిధ వాణిజ్య బ్యాంకుల కన్నా 0.75 శాతం ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఇవ్వడం జరుగుతుందని ఐటీ విభాగం అధికారి రమేష్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి సూపర్‌వైజర్ ఆనంద్, ఎఫ్ఎల్‌సి కోఆర్డినేటర్ ప్రకాష్, నగరి పీఏసీఎస్ సీఈవో తులసిపిళ్ళై, బ్యాంకు సిబ్బంది, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవన నిర్మాణానికి సహకరించాలని

కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి- కుప్పంటౌన్: కుప్పం పట్టణ పరిధిలో విశ్వబ్రాహ్మణ సంఘం కమ్యూనిటీ భవన నిర్మాణానికి సహకరించాలని కోరుతూ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు సంతోష్ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలోని మోడల్ కాలనీ సమీపంలోని సర్వే నంబర్ 16/3 లో గత టిడిపి హయాంలో విశ్వబ్రాహ్మణ సంఘం కమ్యూనిటీ భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించడం జరిగిందన్నారు. అదేవిధంగా కమ్యూనిటీ భవన నిర్మాణానికి అప్పటి ఎంపీ స్వర్గీయ శివప్రసాద్ 6 లక్షల రూపాయల నిధులను మంజూరు చేసినట్టు తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం విశ్వబ్రాహ్మణ సంఘం భవనాన్ని నిర్మిస్తామని చెప్పి పట్టించుకోలేదన్నారు. ఈనేపథ్యంలో విశ్వబ్రాహ్మణ సంఘం కమ్యూనిటీ భవనాన్ని నిర్మించాలని జిల్లా కలెక్టర్‌కు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో విన్నవించుకోవడం జరిగిందన్నారు. ఈవిషయమై స్పందించిన జిల్లా కలెక్టర్ భూమి సబ్‌డివిజన్ చేయాలని, సబ్‌డివిజన్ జరిగిన వెంటనే కమ్యూనిటీ భవన నిర్మాణానికి సైతం చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. విశ్వ బ్రాహ్మణ సంఘం సభ్యులు సత్యరాజ్ పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించండి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండలంలోని బంగారెడ్డిపల్లి బాలికల గురుకుల పాఠశాలను శాసనసభ్యులు డాక్టర్ థామస్ గురువారం తనిఖీ చేశారు. అనంతరం బాలికలతో కలిసి భోజనం చేసి పాఠశాలకు కావాల్సిన మౌలిక వసతులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

కుష్టు వ్యాధి నివారణే లక్ష్యం

సర్వేని పరిశీలించిన డిఎం అండ్ హెచ్ ఓ



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఓ ప్రభావతి దేవి చిత్తూరు నగర పరిధిలోని కాజురు అర్బన్‌హెల్త్ సెంటర్ ఏరియాలోని టెలిఫోన్ కాలనీ, అబ్రహాం సెంటర్ ఏరియాలలోని గిరింపేట, సబ్ జైల్ బౌండ్ ఏరియాలలో కుష్టు వ్యాధి సర్వే, అడల్ట్ బిసిజి వాక్సినేషన్‌పై విస్తృత తనిఖీ చేశారు. ఉదయం పూట అందరూ అందుబాటులో కనుక ఏడు గంటల నుంచి 9 గంటల లోపల కుష్టు సర్వే చేసి గుర్తించిన కేసులను మెడికల్ ఆఫీసర్ దగ్గరికి రిఫర్ చేయాలన్నారు. తర్వాత అడల్ట్ బిసిజి వాక్సినేషన్ వేసి అప్లోడ్ చేయాలన్నారు. సీజనల్ వ్యాధులపై స్టాఫ్ డయేరియా, దోమకాటు వలన వచ్చే డెంగీ, మలేరియాపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. డిపిఎంఓ రవికుమార్, సిఓ కల్పన, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సోమల: మండల కేంద్రమైన సోమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని వైద్య సిబ్బందికి క్షేత్రస్థాయి సిబ్బందికి గురువారం వైద్యాధికారులు జయసింహ, విజయలక్ష్మి, బాలాజీ ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ జాతీయ కుష్టు నివారణ కార్యక్రమంలో బాగంగా కుష్టు వ్యాధి ఇంటింటా సర్వే ఈ నెల 18 నుంచి 2.8.24 వరకు నిర్వహించాలని తెలిపారు. ఈ వ్యాధి మైకో బాక్టీరియమ్ లేప్రి అనే బాక్టీరియా వలన వస్తుందని, ఈ క్రిమిలు తుమ్మడం వలన, దగ్గడం వలన ఒకరి నుండి ఒకరికి వ్యాప్తి చెందుతుందని తెలిపారు. ఈ వ్యాధి లక్షణాలు వున్న వారిని గుర్తించి వారికి ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగా వైద్యం లభిస్తుందని అన్నారు. ప్రజలు కూడా వైద్య సిబ్బంది తమ ఇండ్ల వద్దకు వచ్చినప్పుడు వారికి సహకరించి కుష్టువ్యాధి నివారణ కోసం తమవంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. సోమల, కందూరు, పెద్ద ఉప్పరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యసిబ్బంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్టు వ్యాధి నిర్మూలణ, వ్యాధిగ్రస్తుల గుర్తింపు కార్యక్రమంపై అవగాహన ర్యాలీని ఎంపిడిఓ మురళీ మోహన్ ఆధ్వర్యంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సందీప్ రాజు నిర్వహించారు. ఈ ర్యాలీలో ఆశాలు, వాలంటీర్లు, ఆరోగ్యవైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సదుం : జాతీయ కుష్టు నిర్మూలన సర్వేపై చెరుకువారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గిరీషా ఆధ్వర్యంలో గురువారం సదుం ఎంపిడిఓ కార్యాలయ సమావేశపు హాల్లో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యసిబ్బంది, ఆశా వర్కర్లు, గ్రామీణ స్వచ్చంద కార్యకర్తలకు డాక్టర్ గిరీషా కుష్టు నియంత్రణ, గుర్తింపు ఇంటింటి సర్వేపై అవగాహన కల్పించారు. ఆరోగ్య పర్యవేక్షణ సిబ్బంది ఉదయ్ భాస్కర్, నీలకంఠ, జానికి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: పాడి రైతులను ఆదుకునేందుకే సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేస్తున్నట్టు ఎంపీటీసీ ప్రసన్న కుమారి తెలిపారు. గురువారం మండలంలోని నల్లగాంపల్లి పశువైద్య కేంద్రంలో పశువైద్యాధికారి ఝాన్సీ ఆధ్వర్యంలో మొక్కజొన్న, జొన్న విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాడిన అభివృద్ధి చేసే విధంగా పశువుకు పచ్చి మేత అందించేందుకు రాయితీతో విత్తనాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ విత్తనాలు కావలసిన రైతులు ఆధార్ కార్డు, పొలం పాస్ బుక్కుతో పశువైద్య కేంద్రంలో నమోదు చేసుకున్న వారికి 75శాతం రాయితీ విత్తనాలను పంపిణీ చేస్తామన్నారు. మొక్కజొన్నలు ఐదు కేజీలు రూ.85లు, జొన్నలు రూ.115లతో పాడి రైతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. సహాయ సంచాలకులు ఆసిఫ్, సర్పంచులు షీబా స్వామిదాసు, కోక ప్రకాష్ నాయుడు, టిడిపి మండల అధ్యక్షులు జయప్రకాష్ నాయుడు, కార్యదర్శి జనార్ధన్ గౌడ్, పాడి రైతులు పాల్గొన్నారు.

ఘనంగా పీర్ల పండుగ

ప్రజాశక్తి- సోమల

సోమల మండలం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలో మొహరం పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు గురువారం ఉదయం అగ్నిగుండ ప్రవేశాన్ని నిర్వహించారు. బుధవారం సాయంత్రం గ్రామంలో అందంగా అలంకరించిన పేర్లను ముస్లిం సోదరులు ఊరేగించగా గ్రామస్తులు వారికి నైవేద్యాలను అందజేశారు. అనంతరం గురువారం తెల్లవారు జామున మూడు గంటల నుండి 4.30 గంటల వరకు అగ్నిగుండ ప్రవేశాన్ని చేశారు. కార్యక్రమంలో అధికంగా హిందూ ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ కాలనీలో ఇంటింటి సర్వే

ప్రజాశక్తి- కుప్పం టౌన్

మున్సిపల్ పరిధిలోని 12వ వార్డు ఎన్టీఆర్ కాలనీలో అధికారులు, స్థానిక నాయకులతో కలిసి ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రతి ఇంటి వద్దకు వెళ్ళి నీటి కొళాయి, మరుగుదొడ్ల పై ఆరా తీసి, అనంతరం వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రజలకు ఇంటింటికి తాగునీటి కొళాయి, మరుగుదొడ్లు నిర్మించేందుకు ఇంటింటి సర్వే చేపట్టడం జరిగిందన్నారు. మునిసిపల్ ఇంజీరింగ్ అసిస్టెంట్ భువనేశ్వరి, 12వ వార్డు ఇంచార్జ్ రవి, వార్డు పార్టీ అధ్యక్షులు ఇర్ఫాన్, బూత్ కన్వీనర్ స్వామి, యువ నాయకులు మతిన్, తిరుమూర్తి, పలని, రాధ కృష్ణా, ఉసేన్ తదితరులు పాల్గొన్నారు.

కుర్చీలు వితరణ

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని రేంటలచేను పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రధాన ఉపాధ్యాయురాలు రేణుకా దేవి కుర్చీలను వితరణగా ఇచ్చారు. గురువారం విద్యావనరుల కేంద్రంకు 10 కుర్చీలు వితరణ చేశారు. ఆమెను మండల విద్యాశాఖ అధికారులు, సిబ్బంది అభినందించారు.

గురుకుల విద్యార్థులకు వైద్యపరీక్షలు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని కమ్మనపల్లి ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఉన్న 463 విద్యార్థినులకు వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి స్వల్ప జ్వరాలతో ఉన్న విద్యార్థులకు మందులు మాత్రలు అందజేశారు. అనంతరం డాక్టర్ పద్మావతి, ప్రిన్సిపల్ శోభ పరిసర ప్రాంతాలు, వంటగది, తాగునీటి ట్యాంకర్లను పరిశీలించారు.

ట్వీట్‌తో సమస్య పరిష్కరించిన ఎమ్మెల్యే





ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ట్విట్టర్‌లో వచ్చిన సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే మురళీమోహన్ స్పందించారు. ట్విట్టర్ వేదికగా తన దృష్టికి వచ్చిన సమస్యపై ఎమ్మెల్యే మురళీమోహన్ స్పందించి 24 గంటల్లో సమస్యను పరిష్కరించారు. పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండలం, గోవర్ధనగిరి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల పరిసరాలు పూర్తిగా మురుగునీరు, పిచ్చి మొక్కలతో నిండి దుర్గంధం వెదజల్లుతూ దోమలు స్వైరవిహారం చేయడంతో తరచూ విద్యార్థులు అనారోగ్యం పాలయ్యేవారు. దీనిపై స్పందించిన స్థానికుడు ట్విట్టర్ వేదికగా పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళిమోహన్‌కి సమాచారం అందించారు. దీనిపై స్పందించిర ఎమ్మెల్యే 24 గంటల్లో సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించడంతో హుటాహుటిన అక్కడికి చేరుకున్న అధికారులు దగ్గరుండి మురికి కాలువను, పాఠశాల పరిసరాలను శుభ్రం చేసి మట్టిని నింపారు. అంతేకాకుండా పాఠశాల పరిసరాల్లో మరొకసారి విద్యార్థులకు ఇలాంటి సమస్యలు ఎదురుకాకుండా శాశ్వతంగా పరిష్కారం చూపించారు. అయితే ఎమ్మెల్యే మురళిమోహన్ స్పందినపై ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కేవలం ట్విట్టర్ వేదికగా తమ సమస్యను తీసుకెళ్ళిన మరుక్షణం ఆయన తమకు స్పందించారని, గతంలో పనిచేసిన ఎమ్మెల్యేలు ఏనాడు ఇలా ప్రజాసమస్యలపై స్పందించిన దాఖలాలు లేవని ఆనందం వ్యక్తం చేశారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వ ప్రోత్సాహం

ప్రజాశక్తి - రామకుప్పం: ప్రకృతి వ్యవసాయం సాగుచేసే రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాల ప్రోత్సాహకాలు అందిస్తుందని టిడిపి మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు మునస్వామి, రాష్ట్ర బీసీసెల్ కార్యనిర్వహక కార్యదర్శి పత్రా నారాయణా చారి తెలిపారు. గురువారం మండల సమావేశ భవనంలో ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్న ఎస్సీ రైతులకు ఉచిత టార్పాలిన్ పట్టలు, డ్రమ్ములు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం వల్ల భూసారం తగ్గిపోవడమే కాకుండా, ఆరోగ్యానికి సైతం హానికరంగా ఉంటాయన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు నాణ్యమైన, అధిక దిగుబడులు పొందుతారని తెలిపారు. ప్రతి రైతు కూడా ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలని సూచించారు. మండల ప్రధాన కార్యదర్శి నరసింహులు, రామ్మూర్తి, కృష్ణా నాయక్,నందా రెడ్డి, నాగభూషణం, సుబ్రీ, రఫీ, రామకృష్ణప్ప, విశ్వనాథ్, వెంకటాచలం, బాలరాజు, నయాజ్, సతీష్, వెంకటరమణ, ఆనందప్ప తదితరులు పాల్గొన్నారు.



హస్తకళ మేళాను ప్రారంభించిన ఎమ్మెల్యే



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చేనేత హస్తకళలను ఆదరించాలని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ కోరారు. నగరంలోని స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళా ప్రదర్శన కళాసిల్క్ మేళాను ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ భారతదేశం చేనేత హస్తకళలకు నిలయమని ఆధునిక భారతదేశంలోనూ చేనేత కలలు భారతదేశంలో ఆదరణ పొందుతున్నట్లు తెలిపారు. ఈ వృత్తిపై ఆధారపడిన అనేకమంది చేనేత హస్తకళ కళాకారులు జీవనం సాగిస్తున్నారని వీరిని ఆదుకునే విధంగా చేనేత హస్తకళాకారులు తయారుచేసిన వస్తువులు కొనుగోలు చేయాలన్నారు. చిత్తూరు టిటిడి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళా ప్రదర్శనలు కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు దేశవ్యాప్తంగా చేనేత హస్త కళాకారులు తయారుచేసిన వస్తువులను ప్రదర్శన అమ్మకానికి ఉంచుతున్నట్లు చెప్పారు. చిత్తూరు నగర పరిసర ప్రాంతాల్లోని ప్రజలు చేనేత హస్తకళ వస్తువులను కొనుగోలు చేసి చేనేత హస్త కళాకారులను ఆదుకోవాలని కోరారు.

కుట్టుమిషన్లు వితరణ

ప్రజాశక్తి- విజయపురం (నగరి): స్థానిక ఓంశక్తి ఆలయంలో 38వ వార్షికోత్సవం, 32వ గురుపాదోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం పేదలకు కుట్టుమిషన్లు, ఇడ్లీపాత్రలు, చీరలు పంపిణీ చేశారు. తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, పశుసంవర్ధక శాఖ ఏడీ వాసు, మున్సిపల్ డీఈ నరేష్ ముఖ్య అతిథులుగా పాల్గొని జీవనోపాధిలేని కుటుంబాలకు ఆసరాగా చేతి పనిముట్లు అయిన కుట్టుమిషన్లు, ఇడ్లీపాత్రలు, చీరలు అందించారు. జిల్లా ఆదిపరాశక్తి ఆధ్యాత్మిక ప్రచార కమిటీ అధ్యక్షులు టి.గంగాధర్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



యువత మత్తుకు దూరంగా ఉండాలి

అవగాహన కల్పిస్తున్న అమ్మ ఫౌండేషన్ నిర్వాహకులు వినోద్ కుమార్

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం

ఓ అధ్యయనం ప్రకారం మన దేశంలో యువత ఎక్కువగా ఉన్నట్లు మేధావులు చెబుతున్నారు. మారుతున్న జీవన పరిస్థితులు ఆర్థిక పరిస్థితులు కారణంగా కళాశాలలో విశ్వవిద్యాలయాలతో పాటు ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు సైతం మత్తు పదార్థాలకు బానిసలు అవుతున్నారు. విద్యార్థులతో పాటు సాధారణ సమాజం సైతం మత్తుపదార్థుల బారిన పడడం బాధాకరం. ప్రత్యేకించి విద్యార్థులు మత్తుపదార్థాల బారిన పడకుండా అవగాహన కల్పించడంతోపాటు ఎవరైనా పొరపాటున మత్తుపదార్థాలకు బానిసైనట్లయితే వారికి చికిత్స అందిస్తూ పురావాస కేంద్రాలు ద్వారా వారికి బాగుచేయాల్సిన అవసరం ఉంది. యువతను కాపాడుకున్నప్పుడే దేశం, రాష్ట్రం, జిల్లా, మండలం, గ్రామాలలో అభివృద్ధితో ముందుకు వెళ్తామన్నదే మేధావుల ఆలోచన. వారి ఆలోచనలకు అనుగుణంగా మత్తుకు యువత దూరంగా ఉండాలనే ఉద్దేశంతోనే అమ్మ ఫౌండేషన్ ట్రస్ట్ నిర్వాహకులు వినోద్ కుమార్ అవగాహన కల్పిస్తూ డ్రగ్స్ నిర్మూలించాలని కంకణం కట్టుకున్నారు.

చిత్తూరు జిల్లాలో వివిధ పట్టణాలలో, మండలాలలో కాలేజీలలో విద్యార్థులు, యువతకు డ్రగ్స్ వలన కలిసి ప్రమాదలను వివరిస్తూ కరపత్రాల ద్వారా అవగాహన కల్పిస్తూన్నారు. అలాగే వాటిని నిర్మూలించాలనే ఉద్దేశంతో సంబంధిత అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. ఈ నేపథ్యంలోనే రెండు వారాలకు ముందుగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, చిత్తూరు జిల్లా ఎస్పి మణికంఠ చందోలును కలిసి యువత డ్రగ్స్ వాడకంపై అమ్మ ఫౌండేషన్ ట్రస్టు ద్వారా ఫిర్యాదు చేసి వాటిని పూర్తిగా నిర్మూలించాలని కోరారు. అదేవిధంగా చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద్ రావు, చిత్తూరు స్థానిక ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌ను కలిసి ఈ విషయంపై చర్చించి మత్తు పదార్థాల నుంచి యువతను కాపాడుకోవాలని వినతి ద్వారా కోరారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ అమ్మ ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలనకు అవగాహన కల్పించడానికి ట్రస్ట్ నిర్వాహకులు వినోద్ కుమార్ నిత్యం తమ వంతు ఉద్యమిస్తామని తెలిపారు.





జిల్లా కలెక్టర్, ఎస్పీలకు కరపత్రాలు అందజేస్తున్న అమ్మ ఫౌండేషన్ ట్రస్ట్ నిర్వాహకులు వినోద్ కుమార్

అతిపెద్ద సమస్య మత్తుపదార్థాలు

- వినోద్ కుమార్, అమ్మ ఫౌండేషన్ ట్రస్ట్ నిర్వాహకులు

ప్రస్తుతం సమాజాన్ని పట్టిపీడిస్తున్న అతి పెద్ద సమస్య మత్తుపదార్థాల సమస్య. యువత మత్తు పదార్థాల బారిన పడకుండా అందరు కృషి చేయాల్సిన అవసరం ఉంది. ఎంతోమంది యువతీయువకులు డ్రగ్స్‌కు బానిసై వారి జీవితాలను నాశనం చేసుకోవడంతో పాటు కుటుంబాలను సైతం నాశనం చేస్తున్నారు. యువత ఇలా పక్కదారిన పడకుండా చూడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. వాళ్లందరినీ మంచి మార్గంలో తీసుకురావాల్సిన అవసరముంది.

క్రైం న్యూస్

12 మంది టీడీపీ కార్యకర్తలకు రక్త గాయాలు



ప్రజాశక్తి - పుంగనూరు : పుంగనూరులో టిడిపి వైసిపి పార్టీల మధ్య జరిగిన ఘర్షణలో 12 మందికి టిడిపి కార్యకర్తలకు తీవ్ర రక్తగాయాలు అయ్యాయి. చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డప్ప ఇంటికి రాజంపేట ఎంపీ పీవీ మిథున్ రెడ్డి గురువారం వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న నేతుగుట్లపల్లి రిజర్వాయర్లో భూములు పోగొట్టుకున్న రైతులు నష్టపరిహారం చెల్లిస్తారని చెప్పడంతో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డప్ప ఇంటికి చేరుకోవడం జరిగింది. వైసిపికి చెందిన కార్యకర్తలు అప్పటికే రాళ్లు కర్రలతో సిద్ధంగా ఉండడంతో టిడిపి నేతలు రైతులు పైన రాళ్లు విసిరారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ప్రతిదాడికి దిగారు. టమాటాలు, కోడిగుడ్లతో వారు దాడి చేశారు. వైసిపి జరిపిరాల దాడిలో పట్టణానికి చెందిన షామీర్, నాగరాజు, బసినేపల్లి ప్రసాద్, సల్మాన్, సయ్యద్ సుహేల్ భాష, సయ్యద్ ,సుధాకర్, నరేష్, అజయ్, వివేక్‌లకు తీవ్రరక్తగాయాలయ్యాయి. పట్టణంలోని ఉబేదుల్లా కాంపౌండ్‌కు చెందిన అస్రాప్ చెవ్వుకు బలమైన గాయం తగలడంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు. ఈదాడిలో ఇద్దరు పాత్రికేయ మిత్రులు, ఏఆర్ పోలీస్‌తలకు బలమైన గాయం తగిలింది.

రైలు కింద పడి వృద్ధుడు మృతి

ప్రజాశక్తి- విజయపురం (నగరి): మండలంలోని వెంకట నరసింహరాజు వారి పేట నగరి రైల్వేస్టేషన్ మధ్య 92/3-5 పోస్టుల వద్ద గల ఎగువ రైలు మార్గంలో సుమారు 65 సంవత్సరాల వయస్సు కలిగిన వృద్ధుడు గురువారం ఉదయం 5.30 గంటలకు రైలు బండి కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రేణిగుంట రైల్వే ఎస్ఐ రవి తెలిపారు. ఆత్మహత్య కేసుగా నమోదు చేశామన్నారు. వృద్ధుడు సిమెంటు కలర్ హాఫ్ టీషర్టు, బ్లూకలర్ చెక్స్ లుంగీ దరించి ఉన్నాడన్నారు. వివరాలు తెలిసిన వారు 99631 26343, 94406 27649 నెంబర్లకు సంప్రదించాలన్నారు. మృతదేహాన్ని నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మంచి చెబితే.. దాడి చేశాడు..

స్థలం వివాదంలో సర్పంచ్ మామకు తీవ్రగాయాలు



ప్రజాశక్తి- వెదురుకుప్పం: ఓ స్థలవివాదంలో పెద్దమనిషిగా వెళ్లి తీర్పు చెప్పాడు. గురువారం స్థల బాధితుడు తనకు వ్యతిరేకంగా తీర్పు ఇస్తావా అంటూ సర్పంచ్ మామపై కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలో కలకలం రేపింది. గ్రామస్తులు చెప్పిన వివరాల మేరకు.. వెదురుకుప్పం మండలం, పాతగుంట పంచాయతీలో జగనన్న కాలనీలో సిహెచ్ మునేంద్ర జగనన్న కాలనీలో 3 ఇండ్ల స్థలాన్ని ఆక్రమించుకుని గోడల నిర్మించాడు. ఒక ఇంటి స్థలం పేదలకు ఇచ్చి మిగిలిన వాటిని మునీంద్రను పెట్టుకోమని సర్పంచ్ భువనేశ్వరి మామ బొజ్జారెడ్డి (62)చెప్పారు. ఇది నచ్చని మునీంద్ర బొజ్జారెడ్డిపై కత్తితో దాడి చేశాడు. అతనికి మెడ, చేయి, చిటికిన వేలుపై గాయాలయ్యాయి. దీంతో మునీంద్ర అక్కడ నుంచి పరారయ్యాడు. వెదురుకుప్పం ఎసై శేషగిరిరావు, సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కాగా ఇప్పటి వరకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

రామక్క మృతికి నివాళి

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మహతి ఫౌండేషన్ సహాయక మేనేజర్ శ్రీనివాసులు తల్లి రామక్క బుధవారం రాత్రి మరణించారు. విషయం తెలుసుకున్న మండలం జర్నలిస్టులు, ప్రజానాయకులు, జాతీయ మానవహక్కుల పరిరక్షణ అవనీతి నిర్మూలన సంస్థ జిల్లా ప్రెసిడెంట్ డివి.మునిరత్నం, వైస్ ప్రెసిడెంట్ విజయమ్మ, బిఓ సుబ్రహ్మణ్యం రామక్క మృతదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.


సీనియర్ పాత్రికేయులు మృతి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: సీనియర్ పాత్రికేయులు ప్రసాద్ (మాజీ ఆంధ్రజ్యోతి విలేకరి) బుధవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. గురువారం మండలంలోని తగ్గువారిపల్లిలో వారి స్వగృహం వద్ద ఆయన మృతిదేహాన్ని పలువురు రాజకీయ నాయకులు స్నేహితులు సందర్శించి నివాళులర్పించారు.

డీలర్లతో తహశీల్దార్ సమావేశం

ప్రజాశక్తి- సోమల: మండలంలోని చౌక దుకాణ డీలర్లతో తహశీల్దార్ నాగరాజు తన కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చౌక దుకాణ డీలర్లు తమ దుకాణాలలోని నిత్యావసర సరుకుల స్టాక్ ఎంత ఉంది, ఎంత పంపిణీ చేశారన్న వివరాలను మూడు రోజుల లోపల తెలియజేయాలన్నారు. ప్రతినెల 17వ తేదీ నిర్వహించే చౌకదుకాణ డీలర్ల సమావేశానికి కొందరు హాజరు కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా కొందరు చౌక దుకాణ డీలర్లు మాట్లాడుతూ ఎన్డీయు వాహనాల ద్వారా నిత్యావసర సరుకులు ఇంటి వద్దకే పంపిణీ చేయాల్సి ఉండగా మండలంలో సక్రమంగా వాహనాల ద్వారా పంపిణీ కావడం లేదని తహశీల్దార్‌కు తెలిపారు. ఆయన ఎన్డీయు వాహన నిర్వాహకులతో మాట్లాడి ప్రతినెలా నిత్యావసర సరుకులు సక్రమంగా ఇండ్ల వద్దకే పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ముఖ్యంగా చౌక దుకాణ డీలర్లు తమ వద్ద ఉన్న స్టాకు కార్డుదారులు తీసుకువెళ్లే వరకు ప్రతిరోజు చౌక దుకాణాన్ని తెరిచి ఉంచాలని కొందరు రెండు లేదా మూడు రోజులు ఇచ్చి ఆ తర్వాత స్టాకు లేదని చెప్పడం చౌక దుకాణాన్ని తెరవకపోవడం చేస్తున్నారని తన దృష్టికి వచ్చిందని ఇకపై అలా జరగకూడదని హెచ్చరించారు. కార్యక్రమంలో డిటి రామమూర్తి, చౌక దుకాణ డీలర్లు పాల్గొన్నారు.

రామాలయ భూముల పరిరక్షణకు చర్యలు



ప్రజాశక్తి - రామకుప్పం: మండల కేంద్రంలో నెలకొన్న శ్రీకోదండ రామాలయ భూములను పరిరక్షించేందుకు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఆదేశాల మేరకు రామకుప్పం రెవెన్యూ అధికారులకు సర్వే చేపడుతున్నారు. టిడిపి మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, జనసేన, బిజెపి నేతలతో కలిసి సర్వే చేసి హద్దులను ఏర్పాటు చేసేందుకు పనులు మొదలుపెట్టారు. గురువారం మండల సరిహద్దు కూతవేటు దూరంలో ఉన్న వ్యవసాయ మార్కెట్, ఉపాధి హామీ, శ్రీశక్తి భవనం, శ్రీ వీరాంజనేయస్వామి ఆలయ పరిసరప్రాంతాల్లో ఈ దేవాలయానికి 125ఎకరాల భూములు ఉన్నాయి. రామాలయ భూముల హద్దులను ఏర్పాటు చేసి దేవాలయం భూములుగా బోర్డులు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తహసిల్దార్, రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారన్నారు. ప్రధాన కార్యదర్శి నరసింహులు, బిజెపి నేత రాజసింహ, నందారెడ్డి, విశ్వనాథ్, గజేంద్ర, వెంకటరమణ, మురళి తదితరులు పాల్గొన్నారు.